ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

మంగళవారం 29 ఏప్రిల్ 2025

'సహకారం' బలోపేతం





- రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా సహకార సంఘాలు
- మే 5 నుంచి అమలుకు కసరత్తు
- తొలి విడతగా జిల్లాలో 6 ఎఫ్‌పీవోలు ఏర్పాటు
- మరో ఆరు సింగిల్ విండోల పెంపు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

వ్యవసాయ సహకార పరపతి సంఘాల బలోపేతం వైపు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సహకార రంగంలో వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా రైతులకు విస్తృత సేవలు అందించే దిశగా చర్యలు మొదలయ్యాయి. సహకార పరపతి సంఘాలను పునర్విభజన చేసే కార్యక్రమాలు జరుగుతుండగానే వ్యాపార రంగాల్లోకి సహకార సంఘాలను తీసుకవచ్చే దిశగా పరపతి సంఘాలను రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా మార్చనుంది. ప్రస్తుతం సహకార సంఘాల ద్వారా విత్తనాలు, ఎరువుల విక్రయాలతో పాటు ధాన్యం కొనుగోళ్లతో లాభాలు అర్జిస్తున్నాయి. వీటి స్థానంలోనే రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా ఏర్పాటు చేసి ఇతర వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే దిశగా కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో 311 వ్యవసాయ సహకార పరపతి సంఘాలను రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా మార్పులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీని ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని వ్యవసాయ పనిముట్లు అందుబాటులోకి తేవడం, ఇతర రంగాల్లోనూ అడుగుపెట్టే దిశగా ముందుకు సాగనున్నాయి. మే5 నుంచి ఎంపిక చేసిన సహకార సంఘాలను రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా మార్చి కార్యాకలాపాలను విస్తరించనున్నట్లు సమాచారం. క్లస్టర్‌ల వారీగా నిర్వహణ బేస్‌లైన్ సర్వే ఏజెన్సీల అమలు, వ్యాపార ప్రణాళిక తయారీ, శిక్షణ కార్యక్రమాల నిర్వహణ, బాధ్యతలను ప్రభుత్వ సహకార యూనియన్‌లకు అప్పగించే ప్రక్రియ మొదలు కానున్నట్లు తెలుస్తోంది.

ప్రతి మండలానికి రెండు సంఘాలు

సహకార సంఘాల బలోపేతంచేసే దిశగా వ్యవసాయ సహకార పరపతి సంఘాలను పునర్విభజన చేయాలని ప్రతి మండలానికి రెండు ఉండాలని కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరమే ఆదేశాలు ఇచ్చింది. ఎన్నికల కోడ్ రావడంతో వాయిదా పడుతూ వచ్చింది. ఆ తరువాత వచ్చిన ఆదేశాల మేరకు కసరత్తు చేసినా పనులు నిలిచి పోయాయి. జిల్లాలో ప్రస్తుతం ఉన్న 24సహకార సంఘాలకు తోడుగా కొత్తగా మరో 6సంఘాలు పెరగను న్నాయి. మొదటగా పది సంఘాల పెరుగుదలకు ప్రతిపాదనలు పంపించారు. తాజాగా వాటిలో6 సంఘాలు పెంచే దిశగా ప్రతిపాదనలు ఉన్నాయి. వీటిలో ఇల్లంతకుంట మండలంలో కందికట్కూర్, పెద్దలింగా పూర్, వేములవాడ మండలం చెక్కపల్లి, వీర్నపల్లి, రుద్రంగి, గంభీరావుపేట మండలంలో ఒకటి ఏర్పాటుకు కానున్నాయి. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు సహకార సంఘాల బలోపేతం నిర్ణయాలు జరుగుతున్నాయి.

సొసైటీ	సభ్యులు
సిరిసిల్ల	12,859
పెద్దూర్	1336
నేరేళ్ల	1257
కోనరావుపేట	6196
కోలనూర్	3018
వేములవాడ	8180
నాంపల్లి	1191
రుద్రవరం	998
చందుర్తి	3369
సనుగుల	1733
బోయినపల్లి	910
కోరెం	1694
మాన్వాడ	1163
నర్సింగాపూర్	1684
ఇల్లంతకుంట	3547
గాలిపెల్లి	1680
ముస్తాబాద్	2082
పోత్గల్	7169
గంభీరావుపేట	8183
కొత్తపల్లి	3686
ఎల్లారెడ్డిపేట	3864
అల్మాస్‌పూర్	2139
తిమ్మాపూర్	1597
మానాల	199

తొలి విడతలో ఆరు సొసైటీల్లో మార్పులు

జిల్లాలో 24 వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉన్నాయి. వీటిలో తొలివిడతగా ఆరు సంఘాలను రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా మార్పులు చేయనున్నారు. జిల్లాలో.. మిగతా 8లో

ఇళ్లు నిర్మించుకున్నాం.. బిల్లులు ఇప్పించండి

- ఎమ్మెల్యే కవ్వంపల్లికి గ్రామస్థుల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న అనంతారం గ్రామస్థులు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు నిర్మించుకున్నాం.. బిల్లులు ఇప్పించాలని అనంతారం గ్రామస్థులు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు విన్నవించారు. మానకొండూర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం గ్రామస్థులు ఎమ్మెల్యేను కలిసి గత ప్రభుత్వం ఇళ్లను కట్టుకొమ్మని ప్రొసీడింగ్స్ ఇచ్చిందన్నారు. అప్పులు తీసుకొని వచ్చి ఇంటి పనులు చేపట్టామని వివిధ దశలలో పనులు ఉన్నాయని తెలిపారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రమణారెడ్డి, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు చల్ల నారాయణ, బట్టి క్రాంతి, మచ్చ ప్రభాకర్, బత్తిని రాజు, కరీం, బట్టి మల్లేశం ఉన్నారు.

కార్పొరేట్ జ్యువెల్లరీ షాపు వద్దు

- కలెక్టరేట్ ఎదుట మండల స్వర్ణకారుల నిరసన



కలెక్టరేట్ ఎదుట ధర్నాచేస్తున్న ముస్తాబాద్ మండల స్వర్ణకారులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న జగదంబా కార్పొరేట్ జ్యువెల్లరీ షాపునకు అనుమతులు ఇవ్వకుండా దానిని జిల్లా కలెక్టర్ మూసివేయించాలని ముస్తాబాద్ మండల విశ్వబ్రహ్మణ (స్వర్ణకార) సంఘం అధ్యక్షుడు చింతోజు బాలయ్య, ఉపాధ్యక్షుడు వెంగళం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అనిల్‌లు కోరారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్వర్ణకారులు కలెక్టరేట్ కు తరలి వచ్చి కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝాను కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్తాబాద్‌లో 80స్వర్ణకారుల దుకాణాలు ఉన్నాయని అన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో వెండి, బంగారం ధరలు విపరీతంగా పెరిగినందున కొనుగోళ్లు లేక పోవడంతో మా కుటుంబాలు పనులు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయన్నారు. మండల కేంద్రంలో కార్పొరేట్ జ్యువెల్లరీ షాపు ఏర్పాటు చేయడంతో ఉపాధి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తుమ్మనపల్లి సతీష్, పిన్నోజు కృష్ణమూర్తి, వెంగళం సత్యనారాయణ, నారోజురాజు, రమణ పాల్గొన్నారు.

మేడేను విజయవంతం చేయాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మేడే కార్యక్రమంలో ప్రతి కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేటలో సోమవారం సీఐటీయూ అధ్వర్యంలో మేడే కరపత్రాలను కార్మికులతో కలిసి రమణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పవర్‌లూం వర్కర్స్ యూని యన్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండు రమేష్, సబ్బని చంద్రకాంత్, రమేష్‌శ్రీను, నర్స య్య, శ్రీకాంత్, వైపని వర్కర్స్ యూనియన్ నాయకులు ఎక్కల్‌దేవి జగదీష్, రాము, మ్యానరాజు, గుడుదాస్ వేణు, లక్ష్మణ్, మిట్లపల్లి ప్రసాద్ ఉన్నారు.

భూ భారతి చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపు నిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన భూ భారతి (రికార్డు ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్) చట్టం 2025పై అవగాహన సదస్సు సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేటలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. ముందుగా ధరణి చట్టం, భూ భారతి చట్టంలోని వివిధ అంశాలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ధరణి స్థానంలో కొత్త భూమి హక్కుల రికార్డు-భూ భారతి రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిందని తెలిపారు. హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం ఉందని, భూముల మ్యాప్ జియో ట్యాగింగ్‌తో పాస్ బుక్కులు జారీ చేస్తామని వివరించారు. పెండింగ్ సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం లభిస్తుందని వెల్లడించారు. వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ చేస్తారని, భూమి హక్కులు ఎలా సంక్రమించినా మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదు చేస్తారని వివరించారు, పాసు పుస్తకాలలో భూమి పటం ఉంటుందని స్పష్టం చేశారు. భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, రిజిస్ట్రేషన్ అనంతరం భూధార్ కార్డుల జారీ చేస్తుందని తెలిపారు. ఇంటి స్థలాలకు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డు ఉంటుందని వివరించారు. గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూప రెడ్డి, సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి, ఇన్‌చార్జి తహసీల్దార్ విజయ్ భాస్కర్‌రెడ్డి అధికారులు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతువేదికలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వేడి గాలులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : డీఎంహెచ్‌వో

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పది రోజులుగా వేడి గాలులతో పాటు ఎండ తీవ్రత బాగా పెరిగిందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత అన్నారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మాట్లాడారు. ప్రజలు బయటకు వెళ్లే ముందు ఎండ దెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రజలు ప్రయాణాలు, రైతులు వ్యవసాయ పనులకు వెళ్లవద్దన్నారు. తప్పని పరిస్థితుల్లో బయటకు వెళ్తే ఎండదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తులు అపస్మారక స్థితిలోకి వెళ్లే ప్రమాదం ఉందని వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించాలని సూచించారు. ప్రజలు ఎక్కువగా కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, మజ్జిగ, నీరు ఎక్కువగా తీసుకోవాలన్నారు. పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, బీపీ, షుగర్, వ్యాధి గ్రస్థులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు.

పద్మశాలి కుటుంబాలకు శిక్షణ, ఉద్యోగం



సమావేశంలో మాట్లాడుతున్న ట్రస్టు సభ్యులు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలో నేత కార్మికుల ఆత్మహత్యల నివారణకు పద్మశాలి కుటుంబాలకు శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నట్లు 'మిషన్ ఫర్ ద పూర్' చారిటబుల్ ట్రస్టు ముందుకు వచ్చినట్లు ట్రస్టు కమిటీ సభ్యులు గుంటుక మహేష్, గోనె ఎల్లప్ప పేర్కొన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. హైదరాబాద్‌కు చెందిన మిషన్ ఫర్ ద పూర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 10 వతరగతి ఉత్తీర్ణత పొందిన వారు, ఇంటర్ ఫెయిల్ అయి 14 సంవత్సరాల నుంచి 24 సంవత్సరాలలోపు ఉన్న సిరిసిల్ల పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన యువతీయువకుల బతుకు దెరువు కోసం ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి నాలుగు నెలల శిక్షణతో పాటు నెలకు స్టయిఫండ్ రూ. 11 వేలు, ఉచిత భోజనం, వసతి కల్పించి ఉద్యోగ కల్పించనున్నట్లు తెలిపారు. చేనేత కుటుంబాలకు చెందిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈ సమావేశంలో సభ్యులు కోడం అంజనేయులు, చిమ్మని ప్రకాష్, గెంట్యాల సురేష్, కొండ ప్రతాప్ పాల్గొన్నారు.

108, 102 అంబులెన్స్‌ల తనిఖీ

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఈఎంఆర్‌ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నడుస్తున్న జిల్లాలోని 108 అత్యవసర సేవల అంబులెన్స్, 102 అమ్మ ఒడి వాహనాలు, 1962 సంచార పశు వైద్యశాల, పార్థీవ వాహనాలను సోమవారం అంబులెన్స్ మరమ్మతుల సమన్వయ రాష్ట్ర అధికారి సూర్యనారాయణరాజు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మేనేజర్ సలీం తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో వాహనాలను రికార్డులు, అత్యవసర సమయంలో ఉపయోగించే పరికరాల పనితీరు, వాహనాల పనితీరును పరిశీలించారు. క్షతగాత్రులకు, గర్భిణీలకు, బాలింతలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్య క్రమంలో డాక్టర్ మనీషా, కేప్టెన్ ద్యాగం నరేష్, హెల్పర్ ప్రశాంత్, సిబ్బంది మామిడాల అంజనేయులు, బుర్ర స్వాతి, సిరిసిల్ల ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

పోలీసు సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యం

- ఎస్పీ మహేశ్ బి. గీతే

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యమని ఎస్పీ మహేశ్ బి. గీతే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో 18 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించి సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి గ్రీవెన్స్ డే ఉపయోగపడుతుందన్నారు. అర్జిదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌హెచ్‌ఓలకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించామన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషిచేయడం జరుగుతుందన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది పోలీస్‌స్టేషన్ కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి వినతులు, ఫిర్యాదులు స్వీకరించి అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్‌శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో పొందుపరస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందించడం జరుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

యోగా ద్వారా ఒత్తిడులకు దూరం

యోగా ద్వారా ఒత్తిడులకు దూరం కావచ్చని ఎస్పీ మహేశ్ బి. గీతే అన్నారు. గత మూడేళ్లుగా పోలీస్ ఉద్యోగులకు 15రోజులకు ఒకసారి ఉచితంగా యోగా శిక్షణ ఇస్తున్న తంగళ్లపల్లి మండలంలోని అంకుసాపూర్ ఉపాధ్యాయులు, యోగాచార్యులు ఉప్పుల శ్రీనివాస్‌ను జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ సత్కరించి మెమోంటో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడుల నుంచి ఉపశమనం పొందడానికి ప్రతి ఉద్యోగికి యోగా శిక్షణ అవసరం అన్నారు. శారీరక ధృఢత్వానికి ఆసనాలు అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్‌ఐ యాదగిరి, రమేశ్, మధుకర్‌లు పాల్గొన్నారు.

సన్నాలు కొనుగోలు చేయాలని రైతుల ధర్నా



రహదారిపై ధర్నా చేస్తున్న సింగారం రైతులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సన్న ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామానికి చెందిన రైతులు సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి తరలివచ్చారు. కార్యాలయం ఎదుట కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై ధాన్యం పోసి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. సుమారు రెండు గంటల పాటు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సన్నాల సాగుకు ప్రభుత్వం రూ. 500 బోనస్ చెల్లిస్తుందని సాగుచేస్తే ధాన్యం కొనుగోలు చేసే దిక్కు లేదని మండిపడ్డారు. కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తే మూడు రోజుల కిందట ధాన్యం తూకం వేసి లారీల్లో రైస్ మిల్లుకు తరలించినా మిల్లు నిర్వాహకులు తమకు అనుమతి రాలేదని తెలుపుడంతో ఆగ్రహించారు. తహసీల్దార్ కార్యాలయానికి తరలివెళ్లి ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న డీఎస్‌వో వసంతలక్ష్మీ, తహసీల్దార్ సుజాత, ఎస్‌ఐ రమాకాంత్ అక్కడకు చేరుకున్నారు. రైతులను శాంతింపజేయడానికి చేసిన ప్రయత్నం ఫలించలేదు. రైతులు అధికారులతో వాగ్వివాదానికి దిగారు. రైతులకు ప్రతిపక్ష పార్టీల నాయకులు మద్దతు పలికారు. సన్న ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు దిగుమతిలో జాప్యం లేకుండా చర్యలు తీసుకునే వరకు ఇక్కడ నుంచి కదలబోమని భీష్మించారు. దాంతో డీఎస్‌వో వసంతలక్ష్మీ కల్పించుకుని వెంటనే సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు నిరసన విరమించారు.కార్యక్రమంలో తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు వెంకట్‌రెడ్డి, దేవరాజు, ఉస్మాన్, స్వామి, తిరుపతి, లక్ష్మారెడ్డి, శంకర్, నరేశ్ పాల్గొన్నారు.

ఎల్ఎండీలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య


నరసమ్మ(ఫైల్)

తిమ్మాపూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పరిధిలోని దిగువమానేరు జలాశయలో దూకి ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన ప్రకారం.. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం గుగ్గిళ్ల గ్రామానికిచెందిన కెడిక నరసమ్మ (60) తన భర్తతో కలిసి ఉంటోంది. వారి కుమారులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. అయితే నరసమ్మ భర్త తిరుపతి రెడ్డికి ఇటీవలే హార్ట్‌స్ట్రోక్ వచ్చి ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో నరసమ్మ తన భర్తకు సేవచేస్తూ ఆమె కూడా అనారోగ్యానికి గురైంది. కుమారులు కూడా అందుబాటులో లేకపోవడంతో తమని చూసుకొనే వారులేరని మనస్తాపం చెందింది. ఆదివారం ఈనెల27న కరీంనగర్ వెళ్లి వస్తానని భర్తకు చెప్పి సాయంత్రం ఇంట్లో నుంచి బయలుదేరింది. రాత్రి ఇంటికి వెళ్లకుండా నరసమ్మ ఎల్ఎండీలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. సోమవారం ఉదయం మానేరుడ్యాంలో మృతదేహం కనిపించడంతో స్థానికులు ఎల్ఎండీ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహన్ని వెలికితీసి కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అయితే మృతదేహం ఎవరిదనే సమాచారం లేకపోవడంతో సోషల్‌మీడియాలో మృతురాలికి సంబంధించిన వివరాలు పెట్టడంతో వైరల్ అయ్యాయి. దీంతో సోషల్‌మీడియా ద్వారా తెలుసుకున్న మృతురాలి కుటుంబ సభ్యులు కెడికనరసమ్మగా గుర్తించి ఎల్ఎండీ పోలీసులను సంప్రదించారు. మృతురాలి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సింగరేణి రిటైర్డ్ కార్మికుడి బలవన్మరణం


జంగ మల్లయ్య(ఫైల్)

కోల్‌సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని విఠల్‌నగర్‌లో నివాసముండే జంగ మల్లయ్య(80) అనే సింగరేణి రిటైర్డ్ కార్మికుడు సోమవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొన్నిరోజుల క్రితం భార్య అనారోగ్యంతో మృతి చెందగా ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. కూతుళ్లు, కొడుకు వద్దకు వెళ్లకుండా ఒంటరిగా ఉంటున్నాడు. ఒంటరితనంతో మనస్తాపంచెంది ఆత్మహత్యకు పాల్పడినట్టు మృతుడి కూతురు ప్రమీల వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● మరొకరికి గాయాలు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కోతిరాంపూర్‌లో ఆదివారం అర్ధరాత్రి ఒకటిన్నర గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్ష్మీనగర్‌కు చెందిన తిప్పర్తి హరికృష్ణ(35) దుర్మరణం చెందాడు. తిప్పర్తి పరిపూర్ణాచారి అనే మరో వ్యక్తికి తీవ్ర గాయాలుకాగా ఆసుపత్రికి తరలించారు. కోతిరాంపూర్ మూలమలుపు వద్ద కారు అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలిస్తుండగా హరికృష్ణ మృతిచెందగా, పరిపూర్ణాచారి చికిత్స పొందుతున్నాడు. హరికృష్ణ కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ వన్ టౌన్ సీఐ కోటేశ్వర్ తెలిపారు.

ఆదమరిస్తే అంతే సంగతులు

● వరి కోత యంత్రాలతో జాగ్రత్త
● నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రాణాలకే ముప్పు

వెల్గటూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): యాసంగి వరి కోతలు ఊపందుకున్నాయి. కూలీల కొరత నేపథ్యంలో జిల్లాలో అన్నదాతలు వరి పంట కోయడానికి కోత యంత్రాలు (హార్వెస్టర్)పై ఆధారపడక తప్పని పరిస్థితి ఏర్పడింది. కాగా హార్వెస్టర్లు నడిపే పలువురు ఆపరేటర్ల అజాగ్రత్త ప్రతీ ఏటా ప్రమాదాలకు కారణమవుతోంది. ఈ సంఘటనల్లో కొందరు ప్రాణాలు కోల్పోతుండగా, మరికొందరు అంగవైకల్యంతో జీవితాంతం బాధపడుతున్నారు. ఆపరేటర్ల కొరత వలన ఎక్కువ గంటలు విశ్రాంతి లేకుండా పని చేయడం వలన కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ, అగ్నిమాపక, రవాణా శాఖ అధికారులు హార్వెస్టర్ల యజమానులు, ఆపరేటర్లకు నిబంధనలు, రక్షణ చర్యలపై సీజన్ ఆరంభం ముందే అవగాహన కల్పి స్తే ప్రమాదాలు నివారించే అవకాశం ఉంది.

ఆపరేటర్లు పాటించాల్సిన జాగ్రత్తలు

- హార్వెస్టర్ విడి భాగాలు సరిగా పనిచేస్తున్నదీ.. లేనిదీ పొలంలోకి దిగక ముందే సరిచూసుకోవాలి.
- పని లేనపుడు వాలు ప్రదేశాల్లో నిలిపి ఉంచడం, టైర్ల కింద రాళ్లు అడ్డుపెట్టడం ప్రమాదకరం.
- యంత్రం మరమ్మతుకు గురైతే నిపుణులతోనే తనిఖీ చేయించాలి.
- కన్వేయర్ బెల్టు వంటి భాగాలు మరమ్మతు చేయాల్సి వస్తే అత్యంత జాగ్రత్తతో వ్యవహరించాలి.
- వర్షం, పొగమంచు సమయాల్లో పొలంలో నీళ్లు ఎక్కువగా ఉన్నప్పుడు కోత పనులు చేయవద్దు.
- ఇంజన్ స్విచ్ ఆఫ్ చేయకుండా ఏ పని చేయొద్దు.
- బురద ఉన్నపుడు కోత పనులు చేస్తే యంత్రాలు అందులో కూరుకునే ప్రమాదముంది.

రైతులు, కూలీలు పాటించాల్సినవి..

- హార్వెస్టర్ వెనుక భాగం ఆపరేటర్‌కు కనిపించదు. కోత కోసే సమయంలో ముఖ్యంగా చిన్న పిల్లలు, దివ్యాంగులు యంత్రాల వద్దకు వెళ్లవద్దు.
- హార్వెస్టర్ కదులుతున్నపుడు ఎక్కడం, దిగడం చేయవద్దు.
- రహదారులు, పొలాల్లో అడ్డు వచ్చే కరెంటు తీగలను ఎండిన కర్ర, లేదా రబ్బరు, ప్లాస్టిక్ సాధనాలతో పక్కకు తొలగించాలి.
- యాసంగి కోతల సమయంలో యంత్రాల వద్ద అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలి.



భార్య కనిపించడం లేదని ఫిర్యాదు

జూలపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలుకుంట గ్రామానికి చెందిన సుమలత(31) అనే వివాహిత ఐదు రోజులుగా కనిపించడం లేదని ఆమె భర్తసురేష్ సోమవారం జూలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సుమలత తో సురేష్‌కు 9 సంవత్సరాల క్రితం వివాహం కాగా వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల వారి మధ్య ఏర్పడిన మనస్పర్ధలతో ఈనెల 25నఉదయం ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిందని సురేష్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, సుమలత ఆచూకీ తెలిస్తే 8712658670, 8712656513 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

శంకరపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం తాడికల్ శివారులో పోలీసులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు సంయుక్తంగా దాడిచేసి పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను సోమవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.8400 నగదు స్వాధీనం చేసుకొని కేసునమోదు చేసినట్లు ఎస్ఐ రవి తెలిపారు.

పెద్దపల్లిలో పట్టపగలు దారుణ హత్య

● వివాహేతర సంబంధమే కారణమా?


పోలం కుమార్ (ఫైల్)


హత్య అనంతరం అక్కడే కూర్చున్న సంతోష్

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పట్టణంలో ఉన్న వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో సోమవారం పట్టపగలే దారుణ హత్య జరిగింది. ఈ హత్యకు వివాహేతర సంబంధమే కారణమని తెలుస్తోంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామానికిచెందిన వేల్పుల సంతోష్ కుమార్.. పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికిచెందిన పోలం కుమార్(35)కు తన భార్యతో వివాహేతర సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్నాడు. ఈ విషయమై దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఒకసారి మాట్లాడుకుందామని పోలం కుమార్‌ను సంతోష్‌కుమార్ వ్యవసాయ మార్కెట్‌యార్డుకు రమ్మన్నాడు. సంతోష్ కుమార్ భార్యతో కలిసి మార్కెట్‌యార్డ్‌కు వచ్చాడు. అనంతరం వారిమధ్య వాగ్వాదం చోటుచేసుకొంది.

ఈ క్రమంలో సంతోష్‌కుమార్ వెంట తెచ్చుకున్న కత్తితో పోలంకుమార్‌పై కిరాతంగా దాడిచేశాడు. చనిపోయి తరువాత కూడా మర్మాంగాలపై కాలితో నొక్కి కసి తీర్చుకున్నాడు. దీంతో పోలం కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం సంతోష్‌కుమార్ మృతదేహం ఘటనస్థలం వద్దనే కూర్చొని నీరు తాగుతూ సేదతీరాడు. సంఘటనను చూసిన సంతోష్‌కుమార్ భార్య సొమ్మసిల్లి పడిపోయింది. విషయంతెలుసుకొన్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని ఆమెను ఆస్పత్రికి, సంతోష్‌కుమార్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఈ ఘటన జరుగుతున్న క్రమంలో అక్కడ ఉన్న వారు ఫొటోలు, వీడియోలు తీశారే కానీ ఎవరూ అడ్డుకోలేదు. ఈ ఘటనపై డీసీపీ కరుణాకర్ విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. ఇదిలాఉండగా హత్యకు గురైన కుమార్ భార్య అనిత తన భర్తను సంతోష్, అతడి భార్య శైలజ పథకం ప్రకారమే హత్య చేశారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. నాభర్తని వ్యవసాయ మార్కెట్‌కు రమ్మని ఫోన్‌చేసి చెప్పడంతో కారులో అక్కడికి వెళ్లాడని ఈ క్రమంలో కత్తితో పొడిచి చంపారని పేర్కొంది.

ఆటో బోల్తా.. ఎనిమిది మందికి గాయాలు

సైదాపూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమారం గ్రామంలో సోమవారం ఆటోబోల్తాపడి ఎనిమిది మంది మహిళలకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిగురుమామిడి మండల రేగొండ గ్రామానికి చెందిన మైలారం శారద, చెంచల వనజ, బరిగల శారద, రెంటాల స్వరూప, కల్వల లలిత, కనక మమత, గాదెపాక సౌమ్య, రెంటాల వెన్నెల రేకొండ గ్రామంనుంచి హుజూరాబాద్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో సోమారం గ్రామసమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురికి స్వల్పగాయాలు కాగా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే వారిని హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కారు బోల్తా.. ఇద్దరికి స్వల్పగాయాలు

హుజూరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని వరంగల్ రోడ్‌లో సోమవారం కారు బోల్తా పడి ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ రోడ్‌లోని వెంకటసాయి గార్డెన్ సమీపంలో రహదారిపై వస్తున్న కారును తప్పించబోయిన మరోకారు బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్పగాయాలు కాగా ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు.

బోల్తాపడిన సున్నపు లోడ్ లారీ

మానకొండూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామశివారులో సోమవారం సున్నపులోడ్ లారీ బోల్తాపడింది. కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వెళుతున్న సున్నపులోడ్ లారీ గట్టుదుద్దెనపల్లి వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్


అరెస్ట్ వివరాలను వెల్లడిస్తున్న గోదావరిఖని ఏసీపీ మడత రమేష్

కమాన్‌పూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న ముగ్గురిని కమాన్‌పూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో గోదావరిఖని ఏపీపీ మడత రమేష్ అరెస్ట్ వివరాలను వెల్లడించారు. కమాన్‌పూర్ మండలం గుండారం శివారులోని రాజేందర్‌నగర్ వద్ద ముగ్గురు వ్యక్తులు రెండు కిలోల గంజాయి తరలించేందుకు సిద్ధంగా ఉండగా పక్కా సమాచారంతో ఎస్ఐ కొట్టే ప్రసాద్ దాడి చేసి పట్టుకున్నట్టు తెలిపారు. గంజాయిని తరలిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు మండల కేంద్రానికి చెందిన నవలం మల్లేష్, జగిత్యాల జిల్లా గుడిసెలపేటకు చెందిన అలక సందీప్, మద్దెల హరీష్‌లను అరెస్టుచేసినట్లు తెలిపారు. వీరి నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ఎవరైనా గంజాయి సాగుచేసిన, తరలించిన, విక్రయించిన, వినియోగించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో గోదావరిఖని టూటౌన్‌సీఐ నక్క ప్రసాద్‌రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కన్నతల్లి కర్కశత్వం

● ప్రతీ రోజు కొడుకుపై దాడి
● గొడ్డును బాదినట్లు బాదుతుండడంతో భరించని ఇరుగుపొరుగు
● రహస్యంగా వీడియో తీసి సఖి అధికారులకు కాలనీవాసుల ఫిర్యాదు
● సఖి సెంటర్‌కు తల్లీకొడుకుల తరలింపు ● జగిత్యాల తులసీనగర్‌లో ఘటన


జగిత్యాల సఖి కేంద్రంలో అధికారుల వద్ద ఉన్న బాలుడు

జగిత్యాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సభ్య సమాజం తలదించుకునేలా ఓ కన్నతల్లి కర్కశత్వం ప్రదర్శించింది. కొడుకును తల్లే నిత్యం గొడ్డును బాదినట్లు బాదుతోంది.. మూడు సంవత్సరాలు నిండని పసిబిడ్డపై పైశాచికత్వం ప్రదర్శిస్తోంది. జగిత్యాల జిల్లా కేంద్రంలోని తులసీ నగర్‌లో సోమవారం తల్లి దాష్టికాన్ని భరించలేని ఇరుగుపొరుగు వారు రహస్యంగా సంఘటనను వీడియో తీసి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో తల్లీ కొడుకులను సఖి సెంటర్‌కు అధికారులు తరలించారు. జగిత్యాల జిల్లాకేంద్రంలోని ఆంజనేయులు అనే వ్యక్తికి రమ అనే మహిళతో నాలుగు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఆంజనేయులుకు గతంలో వివాహ జరిగినప్పటికీ మనస్పర్ధల కారణంగా భార్యభర్తలు విడిపోయారు. ఈ విషయం వివరించి రమను నాలుగు సంవత్సరాల క్రితం ఆంజనేయులు రెండో వివాహం చేసుకున్నాడు. వీరిరువురు కొద్దికాలం కాపురం చేశారు. రమ ఆరునెలల గర్భవతిగా ఉన్న సమయంలో ఉపాధి నిమిత్తం ఆంజనేయులు దుబాయికి వెళ్లాడు. రమ తులసీనగర్‌లోని తమ ఇంట్లో కొడుకుతో నివాసం ఉంటోంది. కాగా దుబాయిలో ఉన్న ఆంజనేయులుకు జగిత్యాలలో ఉన్న రమకు మధ్య ఇటీవల మనస్పర్థలు వచ్చినట్లు సమాచారం. ఇంకో మహిళతో ఆంజనేయులు దుబాయి నుంచి తరచుగా ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు రమకు అనుమానం వచ్చింది. ఈ నేపథ్యంలో ఇంట్లో బాబు తరుచూ అల్లరి చేస్తుండడంతో చికాకు, మానసిక ఒత్తిడికి గురవుతున్న రమ ఇటీవల తరచూ బాబును కొడుతోంది. గతంలోనూ కొడుకును కిందపడేసి తొక్కుతుండడం, కొట్టడంతో స్థానికులు విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. ఆ సమయంలో పోలీసులు రమకు కౌన్సెలింగ్ ఇచ్చారని స్థానికులు అంటున్నారు. అయినప్పటికీ రమ పరిస్థితిలో మార్పురాలేదని మళ్లీ పసిబాబును బాదుతుండడం గమనించిన కాలనీవాసులు రహస్యంగా వీడియో తీసి అధికారులకు, సఖి సెంటర్ నిర్వాహకులకు సోమవారం ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా బాలల సంరక్షణ అధికారి హరీశ్, సఖీ సెంటర్ అడ్మిన్ లావణ్య, ఇతర అధికారులు హుటాహుటిన తులసీనగర్‌లోని రమ నివాసానికి వెళ్లి రమను, బాబును సఖీ సెంటర్‌కు తరలించారు. రమకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు.

ఇదిలాఉండగా పోలీసులు సైతం సంఘటనపై విచారణ జరుపుతున్నారు. కాగా బాబును కొట్టిన సంఘటనపై తన తప్పును తెలుసుకున్నానని, ఇక ముందు అలా చేయనని, మరోమారు చేసినట్లయితే కఠినచర్యలు తీసుకోవాలని సఖీ సెంటర్ అధికా రులతో రమ వేడుకుంది. రమకు మానసిక ఆరోగ్యం సరిగా లేదని కాలనీవాసులు అంటున్నారు. కాగా సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు వచ్చినా కేసు నమోదు చేయడంతో పాటు సమగ్ర విచారణ చేపడతామని జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్ తెలిపారు.

లారీ-ద్విచక్ర వాహనం ఢీ

● యువకుడు మృతి, మరొకరికి గాయాలు


నరేశ్(ఫైల్)

మల్యాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం రాజారం దర్గా సమీపంలో సోమవారం లారీ, ద్విచక్రవాహనం ఢీకొని నరేశ్(18) అనేయువకుడు మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మల్యాల మండలం రాంపూర్‌కుచెందిన బోదాసు రాజు కుమార్, అల్లెపు నరేశ్‌లు ద్విచక్ర వాహనంపై జగిత్యాల వైపు నుంచి వస్తుండగా రాజారం దర్గా సమీపంలో లారీవెనక నుంచి ఢీకొట్టింది. దీంతో ఇద్దరికితీవ్రగాయాలు కాగా పోలీసులు జగిత్యాల ఆసుపత్రికి తరలించగా నరేశ్ చికిత్సపొందుతూ మృతిచెందాడు. నరేశ్ ఇటీవల ఇంటర్ పూర్తిచేసి కంప్యూటర్ శిక్షణకు వెళ్లి వస్తున్నక్రమంలో ప్రమాదం జరిగింది. పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

బైక్‌పై నుంచి పడి మహిళ మృతి


లస్మవ్వ(ఫైల్)


మెట్‌పల్లిరూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లిరూరల్ మండలం జగ్గాసాగర్ గ్రామశివారులోని వడ్డెరకాలనీకి చెందిన దుండుగుల లస్మవ్వ(44) భర్తతో ద్విచక్ర వాహనంపై వెళ్తూ సోమవారం ప్రమాదవశాత్తు జారిపడిమృతిచెందింది. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపినవివరాల ప్రకారం.. లస్మవ్వ భర్తతోకలిసి ద్విచక్రవాహనంపై గ్రామానికి వెళ్తుండగా తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే మెట్‌పల్లి ప్రభుత్వఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. భర్త దండుగులనర్సయ్య ఫిర్యాదుతో కేసుదర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వడదెబ్బతో లారీ డ్రైవర్ మృతి

పాలకుర్తి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని బసంత్‌నగర్ గ్రామానికి చెందిన దేవిశేఖర్(43) అనే లారీడ్రైవర్ వడదెబ్బతో సోమవారం మృతిచెందాడు. శేఖర్‌సిమెంటులోడుతో శనివారం వైజాగ్ వెళ్లాడు. ఆదివారం తిరుగుప్రయాణంలో వాంతులు, విరేచనాలు కావడంతో క్లీనర్ సహాయంతో 108లో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని కుటుంబ సభ్యులుతెలిపారు. మృతదేహన్ని వైజాగ్‌నుంచి బసంత్‌నగర్‌కు సోమవారం తీసుకు వచ్చారు. కాగా మృతుడికి భార్య కూతురు ఉన్నారు.

దొంగలు బాబోయ్ దొంగలు

● వరుస దొంగతనాలతో బెంబేలు ● తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్
● పనిచేయని నిఘానేత్రాలు



గంభీరావుపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలంలో ఇటీవల వరుసదొంగతనాలు జరుగుతున్నాయి. తాళాలు వేసిన ఇళ్లనే దొంగలు టార్గెట్ చేస్తున్నారు. ఊర్లకు వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. నాగంపేటలో శనివారం రాత్రి దొంగలు తాళాలు వేసిన 10 ఇళ్లలో బీభత్సం సృష్టించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా 10ఇళ్లలో దొంగతనానికి పాల్పడటంతో స్థానికులు భయందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఏదో ఒకగ్రామంలో ఒకటిరెండు ఇళ్లకే పరిమితమైన దొంగతనాలు పది ఇళ్లకు విస్తరించడంతో వామ్మో ఇవేమి దొంగతనాలు అంటూ ప్రజలు వనికిపోతున్నారు. ఈ మధ్యనే కోళ్లమద్దిలో కూడా రెండు తాళాలు వేసిన రెండుఇళ్లలో దొంగలు బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. కోళ్లమద్దిలో దొంగతనం జరిగి, వారం కూడా గడవక ముందే నాగంపేటలో దొంగలు ఏకంగా10 ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు.

పోలీస్ పెట్రోలింగ్ తిరుగుతున్నా..

గంభీరావుపేట మండలంలో ఓ వైపు పోలీస్‌లు రాత్రివేళల్లో పెట్రోలింగ్ తిరుగుతున్నా దొంగతనాలు ఆగడం లేదు. రాత్రి సమయాల్లో పోలీస్‌లు గ్రామాల్లో ముమ్మరంగా పెట్రోలింగ్ తిరుగుతున్నారు. అయినా వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. పోలీస్‌లకు సవాల్‌గా మారిన ఈ వరుస చోరీలను నివారించాల్సిన అవసరం ఉంది. దొంగలు ఈ ప్రాంతానికి చెందిన వారా.. లేక ఇతర ప్రాంతాలకు చెందిన దొంగల మూఠా సభ్యులా అనేది అంతుచిక్కడం లేదు.

పనిచేయని నిఘా నేత్రాలు

గంభీరావుపేట మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో చాలా వరకు పనిచేయడం లేదు. పలు సంఘటనలను నివారించేందుకు దోహదపడే నిఘానేత్రాలు పనిచేయకపోవడం కూడా సమస్యగా మారింది. ప్రధాన కూడళ్లలో అప్పట్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. నాగంపేటలో ఒక్క గ్రామ పంచాయతీ ముందు ఉన్న సీసీ కెమెరా మాత్రమే పనిచేయగా, మిగితా సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. గ్రామంలోని అన్ని సీసీకెమెరాలు పనిచేస్తే దొంగతనాలపై ఏదైనా క్లూ దొరికి ఉండేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

పాలకుర్తి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని కొత్తపల్లి శివారులోని గుంపుల శ్రీనివాస్‌కు చెందిన మామిడితోటలో సోమవారం ఓవ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బసంత్‌నగర్ ఎస్ఐ తెలిపిన వివరాలమేరకు మంథని మండలం లక్కెపురం గ్రామానికి చెందిన పండుగు మొగిళి(45) ఇటీవల ఓ మహిళ హత్య కేసులో నిందుతుడిగా మంథని పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ కేసుకు భయపడి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని మృతుడికుమారుడు అభిషేక్ ఇచ్చినఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడులు

● ఎనిమిది మంది అరెస్ట్

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి)! జగిత్యాల జిల్లాలో సోమవారం రెండు వేర్వేరు ప్రాంతాల్లో పేకాట స్థావరాలపై దాడి చేసి ఎనిమిదిమంది పేకాటరాయు ళ్లను అరెస్ట్ చేసినట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. రాయికల్ మండలం మైతాపూర్ శివారులో నిర్వహిస్తున్న పేకాటస్థావరంపై, జగిత్యాల పట్టణంలోని భవాని నగర్‌లో ఒక ఇంట్లో పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. రెండు ఘటనల్లో ఎనిమిదిమంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 17,875 రూపాయల నగదు, ఎనిమిది మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో సీసీఎస్ ఎస్ఐ రవీందర్, రమేష్, అఫ్రోజ్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

భూషణరావుపేటలో నిలిచిన ధాన్యం కొనుగోళ్లు

● అర్ధాంతరంగా వెళ్లిపోయిన బీహార్ హమాలీలు


భూషణరావుపేటలో కొనుగోళ్లకు నోచుకోని ధాన్యం

కథలాపూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం భూషణరావుపేటలో సెర్ప్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కొనుగోలు కేంద్రంలో ఐదురోజులుగా ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. బీహార్‌కు చెందిన హమాలీలు ఐదు రోజులు తూకం వేయగా నిర్వాహకులకు ఎలాంటి సమాచారం లేకుండా గురువారం వెళ్లిపోవడంతో ధాన్యం కొనుగోళ్ళు నిలిచిపోయాయని రైతులు వాపోతున్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడిచి ముద్దయి పోయే పరిస్థితి నెలకొందని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఏపీఎం నరహరిని వివరణ కోరగా హమాలీ అర్ధాంతరంగా వెళ్ళిపోవడంతో కొనుగోళ్లు సాగడం లేదన్నారు. హమాలీల కోసం సమాచారం సేకరిస్తున్నామని మంగళవారం వరకు కొనుగోళ్లు జరిపేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, విజయరమణారావు

డీఎంఎఫ్‌టీ నిధుల విడుదల కోసం ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యేలు...

గోదావరిఖని, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కోల్‌బెల్ట్ ప్రాంతంలోని అభివృద్ధి పనుల కోసం అవసరమైన డీఎంఎఫ్‌టీ నిధుల విడుదల చేయాలని సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, కోల్‌బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు కోరారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో మైనింగ్ కారణంగా ప్రజల ఆరోగ్యంపై, జీవన ప్రమాణాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. స్థానిక ప్రజలకు మౌలిక సదుపాయాలు, మంచినీటి సరఫరా, రహదారి, ఆరోగ్యశిబిరాలు, విద్య సౌకర్యాలు కల్పించేందుకు డీఎంఎఫ్‌టీ నిధులు అత్యంత కీలకమని, ఇప్పటికే నిధులు మంజూరైనా విడుదల విషయంలో ఆలస్యం జరుగుతోదని, వెంటనే విడుదల చేసి అభివృద్ధి పనులకు సహకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ ప్రత్యేకంగా మైనింగ్ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి ప్రభుత్వ ప్రాధాన్యత సంబంధిత శాఖలతో చర్చించి, త్వరితగతిన నిధుల విడుదల జరుగుతుందని హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ తెలిపారు.

రైతులకు వరం.. ఉపాధి హామీ పథకం

- చిన్న, సన్నకారు రైతులకు మేలు
- మౌలిక వసతులు, నీటి సంరక్షణ, పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యం

చొప్పదండి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ఉపాధి హామీ పథకం వరంలా మారింది. పారిశుధ్యం, నీటి సంరక్షణ, హరితహారం, చెక్‌డ్యాం, సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో వంటగదుల నిర్మాణాలను చేపడుతున్నారు. వీటితో పాటు రైతులకు పశువుల పాకలు, గొర్రెల పాకలను ఇటీవల మంజూరు చేయగా నిర్మాణాలను చేపట్టారు. సన్న, చిన్నకారు రైతులకు పందిరి కూరగాయల సాగు, చేపపిల్లల పెంపకానికి కుంటలను ఏర్పాటు చేయడం, పొలం గట్లపై మొక్కల పెంపకం, ఫాంపాండ్‌లను నిర్మిస్తున్నారు. రైతుల కోసం ఉపాధిహామీ పథకంలో ఉన్న కొన్ని పథకాల వివరాలు...

● బీడు భూముల అభివృద్ధి పథకం...

బీడు భూముల్లో బండరాళ్ల తొలగింపు, మీటరు లోతు సరిహద్దు కందకం తవ్వుతారు. రాతి కట్టలు, భూమిని చదు ను చేసి పూడిక మట్టిని రైతుల పొలాలకు తరలింపు, చిన్న ఊటకుంటల నిర్మాణం చేపడుతారు.

● మెట్ట భూముల అభివృద్ధి...

మెట్ట భూముల్లో గుళకరాళ్ల కట్టలు నిర్మిస్తారు. ఫాం పాండ్‌ల నిర్మాణం, బావుల్లో పూడిక తీస్తారు. నాడెపు కం పోస్టు, ఎరువు గుంత, సేద్యపు బావుల తవ్వకం చేపడతారు.

● పందిరి కూరగాయల పెంపకం...

చిన్న, సన్నకారు రైతుల భూముల్లో కూరగాయల పెంపకం చేపట్టి సుస్థిర ఆదాయం కల్పించేందుకు పందిరి కూరగాయల పెంపకం కోసం సబ్సిడీ అందజేస్తారు.



ఫాం పాండ్ తవ్వుతున్న కూలీలు(ఫైల్)

● పండ్ల తోటల పెంపకం...

సన్న,చిన్నకారు రైతులకు పండ్ల తోటల పెంపకం కోసం ఉపాధిహామీ పథకంలో ప్రభుత్వం సబ్సిడీని అందజేస్తుంది. ఈ పథకం కింద మామిడి, సీతాఫలం, మునగ, జామ, నిమ్మ, దానిమ్మ, కొబ్బరి, ఆయిల్ పామ్, డ్రాగన్ ఫ్రూట్, సపోట, బత్తాయి, అల్లనేరేడు మొక్కలను అందజేస్తారు.

● పశువుల పాక నిర్మాణానికి వంద శాతం సబ్సిడీ..

ఉపాధి హామీ జాబ్‌కార్డు కలిగిన సన్న, చిన్న కారు రైతులకు వంద శాతం సబ్సిడీపై పశువులు, గొర్రెలు, మేకలు, నాటుకోళ్ల షెడ్ల నిర్మాణాలకు యూనిట్లను మంజూరు చేస్తున్నారు. పశువుల పాక నిర్మాణం కోసం 85,340, గొర్రెలు, మేకల పాకకు 92,000, నాటు కోళ్ల షెడుక్కు 38,344, అజోల్లా పెంపకం కోసం ట్యాంకుల నిర్మాణానికి 6499 రూపాయలను రైతులకు అందజేస్తారు.

● జల సంరక్షణ...

జల సంరక్షణలో భాగంగా రైతులు తమ పొలంలో ఫాంపాండ్స్ నిర్మించుకోవచ్చు. నీటిని నిల్వ చేసుకునే అవసరానికి తగ్గట్టుగా వినియోగించుకోవచ్చు. ఊటకుంట, నీటి నిల్వ కందకాలు, ఫీడర్ కాల్వలు, పంట కాల్వల నిర్మాణం, పశువుల నీటి తొట్టి, చేప పిల్లల పెంపకం కుంటం, ఇంకుడు గుంతల నిర్మాణాన్ని చేపడతారు.



ఫాం పాండ్



పశువుల పాక



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్న మైల్ అంజిరెడ్డి అన్నారు. జగిత్యాల పట్టణంలోని వాల్మీకి ఆవాసంలో ఆదివారం రాత్రి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల ప్రధాన సమస్యలైన బదిలీలు, ప్రమోషన్లు, పెండింగ్ బిల్లుల మంజూరుకు కృషి చేస్తానన్నారు, విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వ పాఠశాలలకు బడ్జెట్లో మరింత నిధులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. నిధుల కేటాయింపులతో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రయత్నిస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్సీగా ఎన్నికై తొలిసారి జగిత్యాలకు విచ్చేసిన ఎమ్మెల్సీ అంజిరెడ్డిని తపస్ జిల్లా శాఖ పక్షాన సత్కరించారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అయిల్నేని నరేందర్‌రావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోనగిరి దేవయ్య, బోయినిపెల్లి ప్రసాద్‌రావు, ఇతర హోదాల బాధ్యు లు గడ్డం మహిపాల్‌రెడ్డి, మేన్నేని నీలిమ, చెరకు మహేశ్వర శర్మ, భాగ్యలక్ష్మీతో పాటు మండల బాధ్యులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోపై దౌర్జన్యాన్ని ఖండిస్తున్నాం

డాక్టర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎల్ కృష్ణప్రసాద్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అన్నప్రసన్నపై కొందరు దౌర్జన్యం చేయడం, బెదిరింపులకు పాల్పడడం వంటివాటిని ఖండిస్తున్నామని తెలంగాణ ప్రభుత్వం డాక్టర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎల్ కృష్ణప్రసాద్ అన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో అనుమతి లేకుండా స్కానింగ్ మిషన్ ఏర్పాటుకు సంబంధించి కలెక్టర్ ఆదేశాల మేరకు తని ఖీలు చేస్తున్నారని తెలిపారు. తనిఖీకి వచ్చిన డీఎంహెచ్‌ఓకు సహకరించకుండా ఆమెపైన దౌర్జన్యానికి దిగడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయడమే తమ విధి నిర్వహణ అని, ఏ ఒక్కరిని ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టలేదని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు కొనసాగుతున్నాయని తెలిపారు. బెదిరింపులు, దౌర్జన్యాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



ద్వితీయ బహుమతి రిఫ్రిజిరేటర్‌ను అందుకుంటున్న పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన గొడుగు శివకృష్ణ కుటుంబ సభ్యులు

ఆంధ్రజ్యోతి కార్, బైక్ రేస్ విజేతలకు బహుమతుల అందజేత

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి' కార్, బైక్ రేస్ కరీంనగర్ యూనిట్ స్థాయి ద్వితీయ, తృతీయ బహుమతుల విజేతలకు రిఫ్రిజిరేటర్, ఎల్‌ఈడీ టీవీని సోమవారం అందజేశారు. 'ఆంధ్రజ్యోతి' కార్, బైక్ రేస్ డ్రా మార్చి 24న నిర్వహించారు. కరీంనగర్ అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఈ కార్యక్రమంలో పాల్గొని విజేతలను ఎంపిక చేశారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ద్వితీయ బహుమతి విజేత పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన గొడుగు శివకృష్ణ కుటుంబ సభ్యులు రిఫ్రిజిరేటర్‌ను అందుకున్నారు. తృతీయ బహుమతి ఎల్‌ఈడీ టీవీని కరీంనగర్ కశ్మీరుగడ్డకు చెందిన అన్వర్ హుస్సేన్ అందుకున్నారు. కార్యక్రమంలో 'ఆంధ్రజ్యోతి' బ్రాంచ్ మేనేజర్ కళ్లెపు సంపత్‌రెడ్డి, బ్యూరో ఇన్‌చార్జి నగునూరి శేఖర్, ఎడిషన్ ఇన్‌చార్జి జయంత్‌రావు, డిప్యూటీ సర్క్యులేషన్ మేనేజర్ పాపారావు పాల్గొన్నారు.



తృతీయ బహుమతి ఎల్‌ఈడీ టీవీ అందుకుంటున్న కరీంనగర్ కశ్మీరుగడ్డకు చెందిన అన్వర్ హుస్సేన్

రాజన్న క్షేత్రం భక్తజన సంద్రం



స్వామివారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. సోమవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. భక్తులు ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా రాజన్నను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆదేశాలతో ఏఈవో శ్రావణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వామివారిని టౌన్ సీఐ వీరప్రసాద్ సోమవారం దర్శించుకున్నారు. వీరప్రసాద్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో పూజలు నిర్వహించారు. వేములవాడ రాజన్న ఆలయంలో జగ ద్గురు శంకరాచార్యులు జయంతి సోమవారం అర్చకులు ఘనంగా ప్రారంభించారు. ఈ నెల 28 నుంచి మే నెల 2వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహించను న్నట్లు తెలిపారు.

రాజన్న ఆలయ పలు విభాగాల్లో ఆకస్మిక తనిఖీ..:

రాజన్న ఆలయంలోని పలు విభాగాల్లో ఏఈవో శ్రావణ్ కుమార్ క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని వారిని ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అత్యాధునిక పద్ధతుల్లో నిత్యాన్నదాన సత్రం

వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రంలో నిర్మించే నిత్యాన్నదాన సత్రాన్ని ఆధునిక పద్ధతుల్లో నిర్మిస్తామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శృంగేరి పర్యటనలో భాగంగా సోమవారం కొల్లూరు మూకాంబిక అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలోని నిత్యన్నదాన సత్రాన్ని, క్యూలైన్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ విస్తరణ పనులకు శంకుస్థాపన చేసుకున్నామని గుర్తుచేశారు. రూ.35 కోట్లతో అన్నదాన సత్రం నిర్మాణం కోసం శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఈవో వినోద్‌రెడ్డి, ఆర్కిటెక్ట్ సూర్యనారాయణమూర్తి, అర్చకులు ఉన్నారు.

జాతీయస్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారిణి

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఈ నెల 30 నుంచి మే 4వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ స్కేటింగ్ పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారిణి శ్రీహన్సి ఎంపికైంది. హైదరాబాద్‌లో గత ఫిబ్రవరిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-11 ఎస్‌జీఎఫ్ స్కేటింగ్ పోటీల్లో పాల్గొన్న శ్రీహన్సి 1500 మీటర్ల రింక్, రోడ్ రేస్ విభాగా ల్లో రెండు బంగారు పతకాలను సాధించి జాతీయస్థాయి పోటీ లకు ఎంపికైందని జిల్లా పాఠశా లల క్రీడా సమాఖ్య కార్యదర్శి వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని బిర్లా పాఠశాలకు చెందిన శ్రీహన్సిని సోమవారం డీఈవో జనార్దన్‌రావు, సెక్టోరి యల్ అధికారి అశోక్‌రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్ శిక్షకుడు హరి అభినందించారు.




శ్రీహన్సిని అభినందిస్తున్న డీఈవో జనార్దన్‌రావు

అరచెయ్యే.. ఆటస్థలం..

- చిన్నారులు, యువతలో సెల్ గేమ్స్ క్రేజ్..
- మితిమీరితే కష్టమే

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఇప్పుడు అర చేయి ఆట స్థలం అయింది. ఆటగాళ్లు ఎందరున్నా, నియమాలు ఎలా ఉన్నా.. సెల్‌ఫోన్ స్టేడియంలో చిన్నారులు, కొత్తతరం కుర్రకారు, యువత ఒంటి చేత్తో ఆటలాడుతున్నారు. మొబైల్ గేమిం గ్ ధోరణి యువత జీవన శైలిలో ఓ భాగమైంది. అర చేతిలో ఇమిడే సెల్‌ఫోన్ ఇప్పుడు సరికొత్త కాలక్షేపంగా అలరిస్తోంది. మొదట్లో సెల్‌ఫోన్ కొనగానే అందులో కొన్ని గేమ్స్ మాత్రమే ఉండేవి. వాటిని ఆడుతూనే ఎంతో ఆనందించేవారు. చిన్నపాటి గేమ్స్‌కు ఉన్న ఆదరణను చూసే ప్రత్యేకంగా త్రీడి, జావా గేమ్స్‌ను తయారు చేసే సంస్థలు పుట్టుకొచ్చాయి. వింత లోకంలోకి లాక్కెళ్లే సెల్‌ఫోన్ గేమ్స్ ఎంతో ఆదరణ పొందుతూ ఓ కొత్త ధోరణికి మార్గం ఏర్పరిచాయి. గేమ్స్‌లో సరికొత్త ట్రెండ్స్ కూడా వేగంగా దూసుకొస్తున్నాయి.



● వేగంగా వ్యాప్తి..: కొత్త మొబైల్ గేమ్ మార్కెట్‌లోకి వస్తే చాలు.. చిన్నారులు, విద్యార్థులు, యువత యువకుల్లో సమాచారం వేగంగా వ్యాపిస్తోంది. గేమ్స్‌కు అలవాటు పడుతున్న వారంతా బ్బం దాలుగా మారిపోతున్నారు. పాఠశాలలు, కళాశాలల కూడళ్లలో సమయం దొరికినప్పుడల్లా వీటి గురించే చర్చలు నడుస్తున్నాయి. సరదాలు, షికార్లకు కొదవలేని సమయం కావడంతో వారు కొత్త దనం కోసం అర్రులుచాస్తున్నారు. ఎప్పటికప్పుడూ అంది వచ్చే సరికొత్త సాంకేతికత వైపు అడుగులు వేస్తున్నారు. ఎస్ఎంఎస్ ద్వారా మొబైల్ సంస్థలు. ఇంటర్‌నెట్‌లో గేమింగ్ వెబ్‌సైట్ల నుంచి డౌన్‌లోడ్ చేసుకుంట్ను వాళ్ల సంఖ్య కూడా పెరుగుతోంది.

● గేమ్స్‌తో జాగ్రత్త.. : మొబైల్ గేమింగ్‌తో కాలక్షేపం మాట అటుంచితే.. ఇదొక వ్యసనంగా మారుతుందని మానసిక శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. విద్యార్థి దశలో విలువైన సమయాన్ని వృథా చేసుకుంటూ సెల్‌ఫోన్లకు అతుక్కుపోతున్నారు.

ఇన్నాళ్లూ కంప్యూటర్ గేమ్స్‌తోనే సరిపెట్టుకునే వారంతా మొబైల్ గేమ్స్‌కు మారిపోతున్నారు. ఎందుకంటే సెల్‌ఫోన్ ఎక్కడికైనా తీసుకెళ్లే వెసులుబాటు ఉండడటంతో ఈ పరిస్థితి వచ్చింది. మొబైల్ గేమింగ్ వల్ల మానసిక ఆలసట, చదువు మీద ఏకాగ్రత లోపించడం వంటి దుష్ప్రభావాలు కూడా కలుగుతున్నాయి. వ్యసన పరులుగా మారితే మాత్రం ఎన్నో ప్రతికూల ప్రభావాలను చవి చూడాల్సి వస్తుంది. విద్యార్థులు సెల్‌ఫోన్ ఆటలతో శారీర కంగా, మానసికంగా బలహీనులవుతున్నారు. ఆలోచన శక్తి సన్నగిల్లుతుంది. విద్యలో వెనుకబడుతారు. సెల్‌ఫోన్ గేమ్స్‌తో విద్యార్థులు ఇతర పనులపై ఆసక్తి చూపకుండా పోయే ప్రమాదం ఉంది.

ప్రభుత్వ పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్‌గా మార్చాలి



పెద్దపల్లి జిల్లా కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్‌గా మార్చాలని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య పేర్కొన్నారు. ట్రినిటీ డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో సోమవారం జరిగిన డీటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, విద్యా కమిషన్ కలిసి ఒక నిర్ణయానికి వస్తున్నారని, విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలను మూసివేయడంలో భాగంగా మండలానికి ఆరుప్రాథమిక పాఠశాలలను మూడు ఉన్నత పాఠశాలలను మాత్రమే ఉంచాలనే సంకల్పంతో చర్చలు జరుగుతున్నాయని, అలా చేయడం సబబు కాదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలంటే పాఠశాలలను సెమిరెసిడెన్షియల్‌గా తీర్చిదిద్దాలని, ఉదయం బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్నం లంచ్, సాయంకాలం టిఫిన్ అందిస్తే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశముంటుందన్నారు. డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.రాజిరెడ్డి, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కే.నారాయణరెడ్డి మాట్లాడుతూ రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులకు సంబంధించిన బకాయిలు, పెన్షన్, మెడికల్ బిల్స్ జాప్యం చేయకుండా బడ్జెట్‌ను వెంటనే అందించాలని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు రామ్‌కిషన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి శ్యామ్, కార్యవర్గ సభ్యుడు ఎం.తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్‌రెడ్డి, సభ్యులు కిషన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

అఖిల భారతీయ స్వర్ణకార సంఘ్‌కు కరీంనగర్ స్వర్ణకారులు

భగత్‌నగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ స్వర్ణకార సంఘ్‌కు కరీంనగర్‌కు చెందిన స్వర్ణకారులు పూర్ణాచారి, రవీంద్రాచారి ఎంపికయ్యారు. బిహార్‌లోని బుద్ధగయలో ఆదివారం అఖిల భారతీయ స్వర్ణకార్ సంఘ్ జాతీయ శాఖ అధ్యక్షుడు యశ్పాల్ చౌహాన్, ప్రధాన కార్యదర్శి రవివర్మ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి, ప్రధాన కార్యదర్శి చేవూరి వెంకటస్వామి ప్రతిపాదించగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి కందుకూరి పూర్ణాచారిని జాయింట్ సెక్రటరీగా, శ్రీరామోజు రవీంద్రాచారిని జాతీయ ఈసీ మెంబర్‌గా ప్రకటించారు. అనంతరం నియామక పత్రాలు అందజేశారు.



పూర్ణాచారి, రవీంద్రాచారికి నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజావాణికి పోటెత్తిన ప్రజలు

- ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి
- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో విన్నపాల వెల్లువ ప్రజలు తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని జిల్లా అధికారులను కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో రెండు వారాలు ప్రజావాణి లేకపోవడంతో సోమవారం ఏర్పాటుచేసిన ప్రజావాణిలో సమస్యలను చెప్పుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు భారీగా జిల్లా కలెక్టరేట్‌కు తరలివచ్చారు. కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయ్‌లు పాల్గొని సమస్యలను విన్నవించేందుకు వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ ప్రజావాణిలో 209 దరఖాస్తులు, ఫిర్యాదులు రాగా ఇందులో రెవెన్యూశాఖకు 36, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు 26, సిరిసిల్ల మున్సిపాల్టీకి 13, హౌజింగ్ శాఖకు 13, కోనరావుపేట తహసీల్దార్‌కు 11, తంగళ్లపల్లి తహసీల్దార్‌కు 11, సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయానికి 8, ఎస్పీ ఆఫీస్‌కు 7, ముస్తాబాద్ తహసీల్దార్‌కు 7లతోపాటు అన్ని శాఖలకు దరఖాస్తులతో పాటు ఫిర్యాదులు వినతిపత్రాలు, అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి త్వరితగతిన పరిష్కారం చూపాలన్నారు.

శిలాఫలకాలను తొలగించాలి

వేములవాడ నియోజకవర్గంలో రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల కోడ్‌ను ధిక్కరిస్తూ ప్రజల మోసం చేసి ఎమ్మెల్యేగా గెలుపొందిన చెన్నమనేని రమేష్‌బాబు పేరుతో ఉన్న శిలాఫలకాలను తొలగించాలని వేములవాడ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్‌ఝాను కలిసి వినతిప్రతాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, వేములవాడ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు న్యాత నవీన్, కోనరావుపేట మండల అధ్యక్షుడు బండిప్రభాకర్, బొమ్మ తిరుపతి, గోపిగౌడ్, అక్కి సునీల్, ఇర్ఫాన్‌షేక్, దయ్యాల జాన్, దినేష్‌గౌడ్, అరుణ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలను వింటున్న జిల్లా కలెక్టర్



కలెక్టరేట్‌కు తరలివచ్చిన రైస్‌మిల్లర్లు

నాకుమారులు పట్టించుకోవడం లేదు

సిరిసిల్ల పట్టణంలోని కోడం వీధికి చెందిన గుడ్ల సత్యమ్మ సోమవారం జిల్లాకలెక్టరేట్‌కు తరలివచ్చి నా కుమారులు నా ఆరోగ్యంతోపాటు తన బాగోగులను పట్టించుకోవడం లేదని కలెక్టర్‌కు విన్నవించారు.

కళాశాల మైదానం పనులు పూర్తి చేయాలి

- గెంట్యాల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్



సిరిసిల్ల పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానం అభివృద్ధి కోసం గత ప్రభుత్వ హయాంలో రూ.2కోట్లు మంజూరు చేయడం జరిగింది. ఆ నిధులలో రూ.1.20 లక్షలు ఖర్చు చేసి సగం పనులు అయ్యాయి. మిగిలి పనులను పూర్తిచేయడంతో పాటు మైదానంలో వాకిం గ్ ట్రాక్, వాలీబాల్, కబడ్డీ కోర్టుల నిర్మాణాలతోపాటు నాలుగు వైపుల గేట్లు ఏర్పాటు చేయాలి.

సమస్యలను పట్టించుకోవడం లేదు

- కంచర్ల పర్శరాములు, పదిర



ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రత్యేక అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు సమస్యలతోనే జీవనం సాగిస్తున్నారు. గ్రామంలోని 7వ వార్డులో మురికికాలువ నిర్మాణానికి ప్రత్యేకగా అధికారిగా ఉన్న తహసీల్దార్‌కు విన్నవించినా పట్టించుకోవడం లేదు. గ్రామంలో 15 సంవత్సరాల క్రితం ప్రమాదాల నివారణ కోసం వేసిన స్పీడ్ బ్రేకర్‌లను ప్రజలకు తెలియజేయకుండానే ప్రత్యేక అధికారి తొలగించారు. గ్రామంలోని గాంధీ విగ్రహం ఎదుట గేట్‌వాల్ లీకేజీ అవుతున్న పట్టించుకోవడం లేదన్నారు.

పాస్‌బుక్‌లో వివరాలు నమోదు చేయాలి

- రంగు ఎల్లయ్య, తంగళ్లపల్లి



తంగళ్లపల్లి మండలం కేంద్రంలోని సర్వే నంబర్‌లో 27 గుంటల భూమిని 1984లో పందిరి బాలయ్య వద్ద కొనుగోలు చేశాను. అప్పుడు అభూమిని పాస్‌బుక్‌లో నమోదు చేయించుకోలేకపోయాను. దీనిపై తహసీల్దార్‌కు దరఖాస్తు పెట్టుకుంటే పట్టించుకోవడం లేదు.

ఎన్ని ఫిర్యాదులు చేసినా ఫలితం లేదు

- ముదారి పోచయ్య, పద్మనగర్



తంగళ్లపల్లి మండలం పద్మనగర్ గ్రామంలో నెల కొన్నసమస్యలను పరిష్కరించాలని నాలుగు సంవత్సరాల నుంచి కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణితో ప్రతివారం వచ్చి దరఖాస్తు చేసుకున్నా ఎలాంటి ఫలితం లేదు. పద్మనగర్ గ్రామంలో నీటి కరవు ఉన్నప్పుడు ట్యాంకర్‌ల ద్వారా అధికారుల అనుమతులతో నాస్వంత డబ్బులతో గ్రామ ప్రజలకు నీళ్ల అందించాం. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులకు నాకు రావాల్సిన రూ. 1.20 లక్షల డబ్బులను జిల్లా కలెక్టర్ ఇప్పించి న్యాయం చేయాలి.

రైస్‌మిల్లులకు సన్నరకం ధాన్యం వద్దు

- రైస్‌మిల్లర్ల యజమానులు

రాజన్న సిరిసిల్లలో రైతులు పండించిన సన్నరకం ధాన్యం మా రైస్‌మిల్లులకు కేటాయించవద్దని జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం జిల్లా కలెక్టరేట్‌కు తరలివచ్చి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్‌ఝాను కలిసి వినతిపత్రం అందించారు. యాసంగి సన్న రకం ధాన్యంలో మొత్తం నూక అవుతుందని ఆ ధాన్యాన్ని తీసుకుని తాము నష్టపోయే పరిస్థితి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు చేపూరి నాగరాజు, ప్రధాన కార్యదర్శి చీటినారాయణరావు, యాజమానులు విష్ణు ఉన్నారు.

కేసీఆర్ కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

తంగళ్లపల్లి మండలం మండెపల్లి గ్రామశివారులోని కేసీఆర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీకి చెందిన మహిళలు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న ఎస్ఐ

వీర్నపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : నూతన సాంకేతిక పరిజ్ఞానం (సీఈఐఆర్)తో పోయిన సెల్‌ఫోన్‌ను వెతికి పట్టుకుని ఎస్ఐ ఎల్లయ్యగౌడ్ బాధితునికి అందజేశారు. వీర్నపల్లి మండలంలోని గర్జనపల్లి గ్రామానికి చెందిన కిషన్ సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈ మేరకు అతను సీఈఐ ఆర్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో సెల్‌ఫోన్‌ను వెతికి పట్టుకున్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధితునికి అప్పగించారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొ ట్టుకున్నా, చోరీకి గురైనా ఫోన్ వివరాలను సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవడంతో తిరిగి పొందే అవకాశం ఉంటుందని ఎస్ఐ తెలిపారు.

సీపీఐ రాష్ట్ర నాయకుడు మల్లేశం వర్ధంతి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ రాష్ట్ర నాయకుడు సామల మల్లేశం ప్రథమ వర్ధంతిని సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్ చౌరస్తాలో సామల మల్లేశం చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కాశ్మీర్ పహల్గంలో ఉగ్రవాదుల దాడిలో అమరులైన దేశ పౌరులకు రెండు నిమిషాలకు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, నాయకులు పంతం రవి, నల్ల చంద్రమౌళి, మంత్రి చంద్రయ్య, సుంకనపల్లి శాంతాబాయి, గాజుల లింగం, నల్ల మార్కండేయులు, జలగం జనార్ధన్, కోడం ప్రమీల పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తలపై తేనెటీగల దాడి



కార్యకర్తలను పరామర్శిస్తున్న జిల్లా అధ్యక్షుడు తోట అగయ్య, బీఆర్ఎస్ నాయకులు

తంగళ్లపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు వెళ్లే వారిపై తేనెటీగలు దాడి చేసినట్లు టీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ దాడిలో తంగళ్లపల్లి మండలం గోపాలరావుపల్లెకు చెందిన కదారి తిరుపతిరెడ్డి, ఎడ్ల విశాక్, అంబటి బాలయ్య, ఎడ్ల నర్సయ్య గాయలపాలైట్లు తెలిపారు. మానకొండూరు శివారులో భోజనం చేయడానికి రహదారి పక్కనే ఓ చెట్టు సమీపంలో బస్సులు నిలిపినట్లు తెలిపారు. భోజనం చేస్తుండగా ఒక్కసారిగా చెట్టుపై ఉన్న తేనెటీగలు లేచి దాడికి దిగినట్లు తెలిపారు. తిరుపతిరెడ్డి తీవ్రంగా గాయపడగా హుటాహుటిన కరీంనగర్‌కు తరలించి చికిత్స చేయించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. గాయపడ్డ కార్యకర్తలను బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, రాష్ట్ర కార్యదర్శి గూడూరు ప్రవీణ్, జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు సిద్ధం వేణు, తంగళ్లపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గజభీంకార్ రాజన్న, జిల్లా సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షులు మాట్ల మధు, జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు మిరాల భాస్కర్, మండల రెడ్డి సంఘం అధ్యక్షుడు ఏసిరెడ్డి రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించిన ఉపాధ్యాయుడు



బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్ అందుకుంటున్న ఉపాధ్యాయుడు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కొమ్ము రమేష్ కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించాడు. హైద్రాబాద్‌లో రెండు రోజులపాటు మదన్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కుంగ్‌ఫు మార్షల్ ఆర్ట్ పోటీలలో రమేష్ ప్రతిభ కనబర్చా డు. దీనితో కరాటేలో బ్లాక్ బెల్ట్ విభాగంలో ద్వితీయ ర్యాంకు సాధించాడు. ఇంటర్‌మీడియట్ చదువుతున్న కాలం నుండి కరాటేలో రమేష్ ప్రతిభ కనబర్చుతున్నాడు. ఈసందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు సన్మానం



సన్మానం పొందిన విద్యార్థులు

చందుర్తి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండల కేంద్రములోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటీవల ప్రకటించిన ఇంటర్ ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన, విద్యార్థులను సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె. దేవరాజం మాట్లాడుతూ నిరంతర కృషి, అధ్యాపకుల ప్రోత్సాహంతో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరంలో ఎంపీసీలో చిలుములు రాంచరణ్, బైపీసీలో ముదిగంపల్లి పావని, సీఈసీలో పిట్టల గ్రీష్మ, ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీలో మ్యాదరి సృజన, బైపీసీలో బత్తుల సిరిచందన, సీఈసీలో మోత్కుపల్లి గౌతమిలు మంచి మార్కులు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచారని పేర్కొన్నారు. జిల్లాలోనే.. చందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం ఫలితాలలో ప్రథమ స్థానంలో నిలిచినదన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది సంక్షేమ బాట



పాదయాత్ర చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల కోసం సంక్షేమ బాట పడితే.. పదేళ్ల అవినీతి, అక్రమాలకు పాల్పడిన బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పి ఇంటికి సాగనంపితే ఆ పార్టీకి రాజకీయ కుటుంబ బాధ కలుగుతోందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం గుంటపల్లిచెరువుతండా, దేవునిగుట్టతండా, బాకురుపల్లితండా గ్రామాల్లో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశ పెట్టి అమలు చేసిందని అన్నారు. మహిళలు సంతోషంతో ఉచితంగా ప్రయాణిస్తే ఫాంహౌస్ నుంచి వచ్చిన మాజీ సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ రజతోత్సవ సభలో మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో మహిళలు జుట్లు పట్టి పీక్కుంటున్నారని అనడం మహిళాలోకాన్ని కించపర్చడమేనని అన్నారు. ఆయన వెంటనే మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకునేందుకు రుణమాఫీ, రైతు బంధు, సన్నాలకు రూ.500 బోనస్ అందిస్తే కాంగ్రెస్ ఏం అమలు చేయడం లేదని మాట్లాడి తప్పుతోవ పట్టించారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, గౌస్, రాంరెడ్డి, బాలయ్య, శ్రీనివాస్, బుచ్చాగౌడ్, అంజిరెడ్డి, ఎల్లాగౌడ్, రమేశ్, రవీందర్, నవీన్‌నాయక్, మాన్‌సింగ్, రవి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్, బీఆర్ఎస్ గురించి మాట్లాడే అర్హత లేదు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు అగయ్య

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్, బీఆర్ఎస్ గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు లేదని, వరంగల్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ ఆవిర్భావ మహాసభ విజయవంతం కావడాన్ని చూసి కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్ బీఆర్ఎస్ రజితోత్సవ మహాసభను విజయవంతం చేసిన జిల్లా ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ లేకుంటే తెలంగాణ వచ్చి ఉండేది కాదని తెలంగాణ ఇవ్వకుంటే కేసీఆర్ ఎట్లా ముఖ్యమంత్రి అయ్యేవాడంటూ మంత్రులు విలేకరుల సమావేశంలో మాట్లాడడం శోచనీయం అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఏనాడో బొందపెట్టారని దేశంలో కూడా అవసాన దశలో ఉందన్నారు. తెలంగాణ కోసం కలసి వచ్చే గొంగలి పురుగునైన ముద్దాడుతామని ఉద్యమం సంయంలో నాడు కేసీఆర్ చెప్పాడని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు బిల్లు అమోదించిన తరువాత యూపీఏ చైర్మన్‌ను తల్లిలా భావించి సోనియాగాంధీకి, మద్దతు ఇచ్చిన మాయవతికి కేసీఆర్ పాదాభివందనం చేశారని అన్నారు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సాధించక పోతే ఈ రోజు రేవంత్‌రెడ్డి ఎలా ముఖ్యమంత్రి అయ్యేవాడని ప్రశ్నించారు. రాష్ట్రం ఏర్పాటు కాకపోతే బ్యాగులు మోసే రేవంత్‌రెడ్డి కనీసం మంత్రి కూడా కాకపోతుండే అని ఎద్దేవా చేశారు. మరోసారి కాంగ్రెస్ పార్టీ నాయకులు, మంత్రులు మరోసారి కేసీఆర్, కేటీఆర్, మా నాయకులపై విమర్శలు చేస్తే ఖబర్ధార్ ప్రజల నుంచి శిక్ష తప్పదని హెచ్చరించారు. కేసీఆర్ ప్రతిపక్షంలో కూర్చున్నా కేసీఆర్ మళ్లీ ఎప్పుడు ముఖ్యమంత్రి అవుతాడని ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. కేసీఆర్‌తో సుపరిపాలన వస్తుందని ఎదురు చూస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, జడ్పి మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, నాయకులు ఒజ్జల అగ్గిరాములు, గజభీంకార్ రాజన్న, మాట్ల మధు, కుంభాల మల్లారెడ్డి, గుగులోతు సురేష్‌నాయక్, సయ్యద్ అప్రోచ్ పాల్గొన్నారు.

గంజివాగుపై హైలెవల్ వంతెన పూర్తిచేయాలని ర్యాలీ

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 28 (అంధ్రజ్యోతి) : బోయినపల్లి మండలం స్థంభంపల్లి గ్రామ శివారులోని గంజివాగుపై నిర్మిస్తున్న హైలెవల్ వంతెన నిర్మాణాలను పూర్తిచేయాలని గ్రామస్థులు సోమవారం గ్రామం నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు బైక్‌లపై ర్యాలీగా తరలివచ్చి ధర్నా చేశారు. గంజివాగు చేపట్టిన హైలెవల్ వంతేన నిర్మాణాలను గత పదినెలలుగా నిలిపివేశారు.అయితే ప్రతి వర్షాకాలంలో స్థంభంపల్లి గ్రామంతో పాటుచుట్టు ప్రక్కల గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు, వాహనదారులు, విద్యార్థులు, ఈ వాగును దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారని గత ప్రభుత్వం గంజివాగుపై హైలెవల్ వంతేన నిర్మాణానికి నిధులను మంజూరుచేయగా ఆ నిర్మాణాలు చేపట్టి పనులు నిలిపివేయడం జరిగిందని గ్రామస్థులు తెలిపారు.



బైక్ ర్యాలీలో గ్రామస్థులు

నిర్మాణాలను ఎక్కడిక్కడే నిలిపివేయడంతోపాటు ఎలాంటి సూచిక బోర్డులను ఏర్పాటుచేయకపోవడంతో వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారని గ్రామస్థులు అగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి నిలిచిపోయిన వంతెనను పూర్తిచేయాలంటూ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్‌ఝాను కలిసి సమస్యలను విన్నవించి వినతిపత్రాన్ని అందించారు. ఈకార్యక్రమంలో స్థంభంపల్లి మాజీ సర్పంచ్ అక్కెనపల్లి జ్యోతికరుణాకర్, మాజీ ఉపసర్పంచ్‌లు బొంగాని అశోక్, బీరవెల్లి వెంకటేశ్వర్‌రావు, రెడ్డి సంఘం అధ్యక్షుడు ముచ్చే లింగారెడ్డి, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు తునికి తిరుమలేష్, శాలివాహన సంఘం అధ్యక్షుడు రాచర్ల రాజేష్, అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షుడు అక్కెనపల్లి గణేష్, అక్కెనపల్లి రమేష్, గొరై విజయ్, గౌడ సంఘం నాయుకులు పులి అంజయ్య, కాసారపు మల్లేశం, ముత్యపు పర్శరాములు, రెడ్డి సంఘం నాయకులు అల్లు రవీందర్‌రెడ్డి, కందడి కిరణ్ రెడ్డి, అంబేద్కర్ సంఘం నాయకులు అక్కెనపల్లి అజయ్‌కుమార్, అక్కెనపల్లి మోహన్‌దాస్, అక్కెనపల్లి సాయి, సృజన్, చంద్రగిరి గంగయ్య ఉన్నారు.

రోడ్డు వెంట చెట్లు.. పచ్చదనానికి మెట్లు



సుద్దాల ఎక్స్ రోడ్డు నుంచి మంగళపల్లి ప్రధాన రహదారి

కోనరావుపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుకు ఇరుపక్కల చెట్లు పెరిగి రోడ్డుకు పచ్చతోరణంలా కనిపిస్తూ వాహనదారులకు ఆహ్లాదాన్ని అందిస్తున్నాయి. కోనరావుపేట ప్రధాన రహదారి సుద్దాల వరకు వివిధ చెట్లు పెరిగి అహ్లాదం అందిస్తున్నాయి. ఉపాధి హామీ పథకంలో భాగంగా రోడ్డుకు ఇరుపక్కల పెట్టిన మొక్కలు పెరిగి వృక్షాలుగా మారాయి. నీడను అందించడమే కాకుండా రోడ్డుకు పచ్చతోరణం కట్టినట్లు ఉన్నాయి.



వేములవాడ నంది కమాన్ నుంచి సుద్దాల దారి

అసంపూర్తిగా వంతెన పనులు

- అప్రోచ్ రోడ్, సేఫ్టీవాల్ నిర్మాణాలు లేక ఇబ్బందులు



అసంపూర్తిగా నిలిచిపోయిన వంతెన

ఇల్లంతకుంట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : బిక్కవాగుపై నిర్మించిన వంతెన పనులు అసంపూర్తిగా మిగిలిపోవడంతో ప్రయాణాలు ప్రమాదకరంగా మారాయి. వంతెన పనులు పూర్తి అయినా అప్రోచ్ రోడ్డు సేఫ్టీవాల్స్ నిర్మాణాన్ని చేపట్టలేదు. వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా వాహనం నడిపినా వంతెన పైనుంచి పడే ప్రమాదం ఉన్నది. వంతెన పనులు పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

'సహకారం' బలోపేతం

(5వ పేజీ తరువాయి)

వేములవాడ, సనుగుల, నాంపల్లి, అల్మాస్‌పూర్, గంబీరావుపేట, ఇల్లంతకుంట సహకార సంఘాలను రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా మార్పులు చేసి సేవలు అందించనున్నారు. కేంద్రం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు జాతీయ సహకార అభివృద్ధి సంస్థతో అవగాహన ఒప్పందం చేసుకోనున్నారు. ఈ సొసైటీ లకు ఈక్విటీ వాటాగా కేంద్ర ప్రభుత్వం రూ. 15 లక్షల వరకు ఒక్కో సొసైటీకి మ్యాచింగ్ గ్రాంట్ కింద అందిస్తుంది. మూడు సంవత్సరాల నిర్వహణకు ఏడాదికి రూ.6 లక్షల చొప్పున రూ.18 లక్షలు ఇస్తుంది. సహకార శాఖ ఉద్యోగులకే రైతు ఉత్పత్తి సంస్థల బాధ్యతలను అప్పగించనుంది.


వాస్తవ చరిత్ర పూలే సినిమా విడుదల చేయాలి

కోనరావుపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వాస్తవ చరిత్రతో కూడిన పూలే సినిమాను ఎలాంటి సెన్సార్ లేకుండా వెంటనే విడుదల చేయాలని ధర్మ సమాజ్ పార్టీ కోనరావుపేట మండల కన్వీనర్ అమర్ మహారాజ్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ తొలి సామాజిక విప్లవ పితామహుడు మహాత్మా జ్యోతిరావు పూలే జీవిత చరిత్రను సినిమా రూపంలో తీయడం జరిగిందన్నారు. సెన్సార్ బోర్డు ఎలాంటి సినిమాలు కట్ చేయకుండా, ఉన్నది ఉన్నట్టుగా విడుదల చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకొని ఎలాంటి ఇబ్బందులు లేకుండా విడుదల చేయించాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం

ఇల్లంతకుంట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలో నిర్మించనున్న రేణుకాదేవి ఆలయ నిర్మాణానికి పెద్దలింగాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ గొడిశెల జితేందర్‌గౌడ్ ఆర్థిక సహాయం అందించారు. గ్రామంలో ఆలయ నిర్మిస్తున్నామని సోమవారం గ్రామస్థులు కలువగా రూ. 5,116 అందించారు. ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని పేర్కొనగా గౌడసంఘ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గౌడసంఘ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అటవీప్రాంతంలో అసాంఘిక కార్యక్రమాలు



మద్యం సీసాలు

చందుర్తి, ఏప్రిల్ 28 (అంధ్రజ్యోతి) : చందుర్తి మండలం లింగంపేట శివారు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. అటవీ ప్రాంతం కావడంతో కొంతమంది యువకులు మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు మద్యంతో పాటు గంజాయి సేవిస్తున్నారు. ఆదివారం కొంత మంది యువతీయువకులు కార్లు, ద్విచక్ర వాహనాలపై వచ్చి వెళ్తున్నారని, పంట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందిగా మారుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. పోలీస్, అటవీ శాఖ అధికారులు దృష్టి సారించాలని రైతులు, మహిళా కూలీలు కోరుతున్నారు.

సివిల్ అసిస్టెంట్ సర్జన్ ప్రభుత్వానికి సరెండర్

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేసే సివిల్‌అసిస్టెంట్ సర్జన్ చంద్రశేఖర్‌ను ప్రజా ఆరోగ్య, కుటుంబ సంచాలకులకు సరెండర్ చేసినట్లు సోమవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆసుపత్రి పరిశీలనకు వచ్చిన సందర్భంగా సివిల్ అసిస్టెంట్ సర్జన్ చంద్రశేఖర్ ఎంఐసీయూ వార్డులో పేషెంట్లతో దురుసుగా ప్రవరిస్తున్నారని పలు ఫిర్యాదులు కలెక్టర్‌కు అందడంతో చంద్రశేఖర్‌ను సరెండర్ చేయాలని కలెక్టర్ ఆదేశించినట్టు సూపరింటెండెంట్ పేర్కొన్నారు.